సీపీఐ మహాసభలకు తరలిన నాయకులు



సీపీఐ మహాసభలకు తరలివెళ్తున్న జవహర్‌నగర్ సీపీఐ నాయకులు

జవహర్‌నగర్: సీపీఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలకు బుధవారం జవహర్‌నగర్ నుంచి సీపీఐ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, నర్సింహ, స్వరూప, ఎల్లయ్య, సత్యం, రవి, జయమ్మ, అంజయ్య, అశోక్, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

కత్తి పుష్పలతకు డాక్టరేట్



శామీర్‌పేట్: అలియాబాద్ మున్సిపాలిటీ, లాల్‌గడి మలక్‌పేట్‌కు చెందిన కత్తి పుష్పలత డాక్టరేట్ సాధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన 84వ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ నారాయణ్, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కుమార్ చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ పట్టా అందుకుంది. గణితంలో ×నుమరికల్ స్టడీ ఆఫ్ ఎమ్‌హెచ్‌డీ డార్సీ ఫోర్చ్‌హైమర్ ఫ్లో ఆఫ్ నాన్ న్యూటనియన్ నానో ఫ్లూయిడ్స్‌¤ అనే అంశంపై గైడ్ ప్రొఫెసర్ బండారి శంకర్ పర్యవేక్షణలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధన పూర్తి చేసినందుకు పుష్పలత డాక్టరేట్‌ను అందుకున్నారు. కుటుంబసభ్యులు, స్నేహితులు పుష్పలతను అభినందించారు.

డ్రోన్ టెక్నాలజీ సెంటర్‌ను వినియోగించుకోవాలి



డ్రోన్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభించిన అనంతరం తిలకిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్ టెక్నాలజీ సెంటర్‌ను బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక రంగంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయని.. ప్రతి విద్యార్థి డ్రోన్ టెక్నాలజీ సెంటర్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి గోపాల్‌రెడ్డి, డైరెక్టర్ నారాయణ, హెచ్‌ఓడీలు రవీంద్ర బాబు, నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యను ప్రోత్సహించడమే లక్ష్యం

దబిల్‌పూర్ గ్రామంలో నూతన హైస్కూల్ భవనం

మేడ్చల్: గ్రామీణ విద్యను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ×వన్ స్కూల్ ఎట్ ఏ టైమ్‌¤ సంస్థ సహకారంతో మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా, దబిల్‌పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అధునాతన సౌకర్యాలతో 5 నూతన తరగతి గదుల భవనాన్ని నిర్మించి, బుధవారం ప్రారంభించారు. దబిల్‌పూర్‌లోని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలనే సంకల్పంతో మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, రజిత దంపతులు ×వన్ స్కూల్ ఎట్ ఏ టైమ్‌¤ సంస్థను సంప్రదించి, పాఠశాల భవన నిర్మాణానికి తమ వంతు సహకారం అందించారు. రూ.90 లక్షలతో భవనాన్ని నిర్మించడంపై విద్యాశాఖ అధికారులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

పాత నేరస్తుల బైండోవర్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పోలీసులు పలువురు పాత నేరస్తులను బుధవారం కాప్రా తహసీల్దార్ సుచరిత ఎదుట బైండోవర్ చేశారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఉండేందుకు పాత నేరస్తులు సాయితరుణ్, కృష్ణ, భీమయ్య, శేఖర్, హరీష్‌కుమార్, బషీర్, అబ్దుల్ అజీజ్‌లను బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ పోలీసులు పాల్గొన్నారు.

సమగ్ర నైపుణ్యాభివృద్ధి అభినందనీయం

పోచారం: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా శ్రీనిధి యూనివర్సిటీ కృషి చేయడం అభినందనీయమని మాస్‌టెక్ డిజిటల్ చీఫ్ డెలివరీ ఆఫీసర్ పుచ్చ జితేంద్ర చక్రవర్తి అన్నారు. బుధవారం యంనంపేట్‌లోని విశ్వవిద్యాలయంలో జరిగిన ఓరియెంటేషన్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులందరికీ సమానంగా నైపుణ్యాలను అందించడంలో వర్సిటీ ముందుంటుందన్నారు. విశ్వవిద్యాలయాలు సామాజిక మార్పునకు మూల కేంద్రాలన్నారు. యూనివర్సిటీ ప్రో చాన్స్‌లర్ నర్సింహ్మారెడ్డి, ప్రెసిడెంట్ అభిజిత్‌రావు, డీన్ కార్తికేయన్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేయాలి

సీపీఐ సీనియర్ నేత కందిమళ్ల ప్రతాపరెడ్డి



సాక్షి,మేడ్చల్ జిల్లా: వీర తెలంగాణ గడ్డపై బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకునే శక్తి కేవలం వామపక్ష పార్టీలకే ఉందని, ఇందుకు అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు, సీపీఐ సీనియర్ నేత కందిమళ్ల ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ వందేళ్ల ప్రస్థానంలో చేసిన పోరాటాలు, త్యాగాలు సాధించిన విజయాలను మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని గాజుల రామారం (కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు నగర్)లోని మహారాజాగార్డెన్(కామ్రేడ్ ఎన్.బాలమల్లేశ్ హాల్)లోని సీపీఐ రాష్ట్ర 4వ మహాసభల్లో ఆయన మాట్లాడుతూ.. మాతృదేశం కోసం సీపీఐ నాయకులు ప్రాణాలను అర్పించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 1942 వరకు భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్నా.. రైతులు, కూలీలు, విద్యార్థులు, యువకులను సంఘటితం చేసి స్వాతంత్ర్య పోరాటంలో కదిలించిందన్నారు. నిరంకుశ నిజాంకు వ్యతిరేకంగా మట్టి మనుషులతో బంధూకులు పట్టించి సాయుధ సమరాన్ని నడిపిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు.

కీలకపాత్ర పోషించాలి..

కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేసేందుకు కీలకపాత్ర పోషించాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజాను ఆయన కోరారు. రాజకీయాలు వ్యాపారంగా మారాయని, కమ్యూనిస్టుల పాత్ర ఏమిటనేది మహాసభలో ఆత్మపరిశోధన చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే స్ఫూర్తి అని, అయితే మాజీ సీఎం కేసీఆర్ తానే వీరుడిగా చెప్పుకుంటున్నారన్నారు. కమ్యూనిస్టులందరి ఆశయం ఒక్కటేనని, ఐక్యత తమ ఆయుధమని, ఐక్యత ద్వారా కమ్యూనిస్టు స్ఫూర్తి, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కుళ్లుతున్న వ్యవస్థను కూకటి వేళ్లతో తొలగించాలని సినీనటులు మాదాల రవి అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాంస్కృతిక విప్లవం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఎర్రమల్లెలు లాంటి సినిమాలు తీసిన మాదాల రంగారావు కూడా కమ్యూనిస్టు పార్టీ తయారు చేసిన ఆయుధమేనన్నారు.

రక్తంతో ఎరుపెక్కిందే ఎర్ర జెండా : ఏటుకూరి ప్రసాద్

అమర వీరుల త్యాగం, రక్తంతో ఎరుపెక్కిన జెండా ఎర్రజెండా అని, నిజాంకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటంలో ఎందరో అమరులైన వారి వారసత్వం బాట ఎర్రబాట అని ఏటుకూరి ప్రసాద్ అన్నారు. గతంలో కమ్యూనిస్టులు రక్తార్పణతో ఏ ఆశయాలు, ఆదర్శాలతో ముందుకెళ్లారో.. ఆ ఆశయాల స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఫాసిజం ఎన్నో రకాల ముసుగు ధరించి చిన్నల నుంచి పెద్దల వరకు అనేక రూపాల్లో బయటపడటం ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమన్నారు. ఈ పరిస్థితులు ఎదుర్కొనే శక్తి కేవలం వామపక్షాలకు మాత్రమే ఉందన్నారు.

మూడు రోజులపాటు జరగనున్న సభలు..

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని గాజులరామారంలోని మహారాజాగార్డెన్‌లో మూడు రోజుల పాటు జరిగే సీపీఐ రాష్ట్ర 4వ మహాసభను బుధవారం ప్రారంభమయ్యాయి. మహాసభల్లో రాష్ట్రంలోని 33 జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తూ.. 743 మంది పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు. ప్రారంభ సభకు సీపీఐ శ్రేణులు ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు ధరించి పెద్ద ఎత్తున హాజరయ్యారు. ప్రాంగణమంతా అరుణవర్ణం సంతరించుకుంది. ముఖ్యఅతిథిగా రాజా, అతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాల్గొన్నారు. సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సౌహార్ద సందేశాలిచ్చారు. మహాసభ ఆహ్వానసంఘం అధ్యక్షుడు ఎండీ.యూసుఫ్ అధ్యక్షత వహించగా.. సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గసభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరరావు, సీపీఐ సీనియర్ నేత కందిమళ్ల ప్రతాపరెడ్డి, కవి, రచయిత ఏటుకూరి ప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హేమంతరావు, శంకర్, బాల నరసింహ, వీ.ఎస్.బోస్, నరసింహ, సినీనటుడు డాక్టర్ మాదాల రవి, ఆహ్వానసంఘం గౌరవాధ్యక్షుడు డీజీ.సాయిల్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఆస్పత్రుల్లో కావాల్సిన వసతుల నివేదిక పంపడి
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి



శామీర్‌పేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

శామీర్‌పేట్: అత్యంత అవసరమైన మౌళిక వసతుల వేదికను వెంటనే పంపాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి వైద్యాధికారిని ఆదేశించారు. తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శామీర్‌పేట సామాజిక ఆరోగ్య కేంద్రంలోని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రహరీ నిర్మించి గేటును ఏర్పాటు చేయాలని సూచించారు. ఆస్పత్రి పై కప్పు నుంచి నీరు లీకవుతోందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పై కప్పుకి రేకుల షెడ్ నిర్మించాలని అందుకు అవసరమయ్యే నిధులు మంజూరు చేస్తానని ఆయన చెప్పారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో స్నేహ భావంగా ఉండాలని వైద్యులకు సూచించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం ఆస్పత్రి వార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట తహసీల్దార్ యాగదిరిరెడ్డి, డీసీహెచ్‌ఎస్ సునీత, మెడికల్ ఆఫీసర్ శివకిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రముఖ విద్యావేత్త డాక్టర్ శ్రీనివాస్

పోచారం: ఇంజినీరింగ్ విద్యార్థులకు వర్క్‌షాపులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ శ్రీనివాస్ బాచు అన్నారు. బుధవారం కొర్రెముల్‌లోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) భారతీయ భాషల అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో 'క్వాంటమ్ కంప్యూటింగ్'పై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. క్వాంటమ్ కంప్యూటింగ్ పునాదులు, వినియోగాలు, భవిష్యత్తు, సాంకేతిక రంగంపై దాని ప్రభావం గురించి విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించారు. క్యాంపస్ ఇన్‌చార్జి అజయ్‌కుమార్, నెట్‌వర్క్ ఆఫీసర్ అనిల్, డాక్టర్ ప్రకాష్‌రావు, డా.జనార్ధన్, వెంకటేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల అధ్యాపకులకు పీహెచ్‌డీ



స్పందన



స్రవంతి



ఝాన్సీరాణి



పావని

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (భువనగిరి) కళాశాల అధ్యాపకులకు ఉస్మానియా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేసింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ, ఇస్రో చైర్మన్ నారాయణన్, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కుమార్ వారికి పట్టాలు అందజేశారు. ఫిజిక్స్‌లో స్పందన, మైక్రోబయాలజీలో స్రవంతి, ఎకనామిక్స్‌లో ఝాన్సీరాణి, కంప్యూటర్ సైన్స్‌లో పావని గౌరవ పీహెచ్‌డీ పట్టాలు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు ఇతర సిబ్బంది వారిని అభినందించారు.

విద్యార్థులకు చదువుతో పాటు జ్ఞానాన్ని అందించాలి

తొలిసారిగా ఐక్యరాజ్య సమితి నమూనా ఆవిష్కరణ



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

కీసర: మొట్టమొదటిసారిగా జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్ రాంపల్లిలో ఐక్యరాజ్య సమితి నమునాను ఘనంగా నిర్వహించడం గొప్ప విషయమని స్కూల్స్ డైరెక్టర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత వరలక్ష్మి అన్నారు. బుధవారం జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్–రాంపల్లిలో ఐక్యరాజ్యసమితి నమునా (ఎంయూఎన్ 2025–2026) సదస్సును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు ప్రాపంచిక జ్ఞానాన్ని అందించేందుకు ప్రపంచం ఎదుర్కొంటున్నా సమస్యలపై విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం కలిగించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, స్కూల్ హెచ్‌ఎం సుశీల, అకడమిక్ కో– ఆర్డినేటర్ జ్యోతిర్మయి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

చౌదరిగూడ గ్రామస్తులు డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడలో వెంకటసాయినగర్ వెంచర్‌ను 2013వ సంవత్సరంలో 11.32 ఎకరాల విస్తీర్ణంలో చేశారని, ఇందులో ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించాల్సిన స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు పి. రాజా నరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఘట్‌కేసర్ మండల తహసీల్దార్‌కు వీరు వినతి పత్రం అందజేశారు. అనంతరం చౌదరిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వెంచర్ కోసం కేటాయించిన 11.32 ఎకరాల్లో ప్లాట్లు, రోడ్లు, పార్కు విస్తీర్ణం పోగా, ఇంకో 16 గుంటల భూమి మిగిలిందన్నారు. దీని విలువ సుమారు రూ.7 కోట్లు ఉంటుందని అన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించాల్సిన 16 గుంటల మిగులు భూమిని కొందరు వ్యక్తులు సర్వే నెంబర్ 851/ఈ కింద డిజిటల్ పాస్ పుస్తకాలు, నాలా ఆర్డర్ పొందారన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించి మోసపూరితంగా పొందిన పాస్ పుస్తకాలు, నాలా ఆర్డర్‌ను రద్దు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆలయ భూముల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు

పోచారం: వెంకటాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూముల్లో ఎవరైనా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆలయ కార్యనిర్వహణాధికారి భాగ్యలక్ష్మి ఓ ప్రకటనలో బుధవారం హెచ్చరించారు. దేవర బాలాజీ భూముల్లో నిర్మాణాలు చేపట్టేందుకు ఎవరికైనా డబ్బులు ఇచ్చినట్లయితే దేవస్థానానికి ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. ఈ ప్రకటనను ఖాతరు చేయకుండా ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు నాగారంలో నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష

కీసర: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కీసర ఆర్డీఓ సూచనల మేరకు వినాయక చవితి, వినాయక నిమజ్జన ఏర్పాట్లపై నేడు గురువారం నాగారంలోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 11 గంటలకు సమన్వయ సమావేశం జరగనుందని నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్లు భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలు ప్రకటించారు. ఈ సమావేశానికి అన్ని విభాగాల అధికారులు హాజరుకానున్నట్లు వివరించారు.

నూతన బోరు ప్రారంభం

ఘట్‌కేసర్: పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీ కమ్యూనిటీహాల్ ఆవరణలో ఆ కాలనీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి మేరకు మున్సిపల్ నిధులతో బుధవారం బోరు వేయించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, మాజీ కౌన్సిలర్ శశికళ, కాలనీ అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి శశిధరణ్, దేవేందర్‌ముదిరాజ్, రామ్మోహన్, గోపాల్‌గౌడ్, సురేష్, అశోక్‌ముదిరాజ్, రమేష్, సుధాకర్, శ్రీనివాస్, రాకేష్, హనుమంతు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ఈనెల 24న రిపోర్టు చేయాలని వినతి

జవహర్‌నగర్: హకీంపేటలోని తెలంగాణ క్రీడా పాఠశాలలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా స్థాయి బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి స్టాండ్లీ జోన్స్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. జంపింగ్, పరుగు పందెం, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 24 ఉదయం 7గంటల వరకు తమ బర్త్ సర్టిఫికెట్‌ను అందజేయాలన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చే క్రీడాకారులు ఈనెల 29, 30 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక అవుతారని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నం .98496 12733లో సంప్రదించాలని కోరారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న మాజీ కౌన్సిలర్ వెంకటేశ్‌గౌడ్

పోచారం: పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్‌గౌడ్ అన్నారు. బుధవారం అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో చౌకధరల దుకాణం వద్ద కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా బాలగోని మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా రేషన్ కార్డులు మంజూరవుతాయని పేర్కొన్నారు. కార్డులు అందని వారు ఆందోళన చెందొద్దని చెప్పారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, డీలర్లు అనిల్, కవిత, కాంగ్రెస్ నాయకుడు కొంతం శంకర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు సుధాకర్, స్థానిక నాయకులు బలరామ్, వెంకటేశ్, రమేష్, మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

జ్ఞానం తరగని సంపద



ఓరియెంటేషన్ డేలో పాల్గొన్న అతిథులు

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ జ్ఞానాన్ని పెంచుకోవాలని, జ్ఞానమే తరగని సంపద అని కాళోజీ పురస్కార గ్రహీత నారాయణస్వామి అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహ్మారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఓరియెంటేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామితో పాటు ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ రాంమూర్తి, సైకాలజిస్ట్ చాముండేశ్వరి, టాటా గ్రూప్స్ సీనియర్ మేనేజర్ నీరజాసింగ్ పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు ఎల్లప్పుడు కష్టపడుతూ.. తమ పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ.. ప్రతిభను మెరుగుపర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎల్లప్పుడూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచించినప్పుడే ఇంజినీరింగ్ విద్యలో రాణించగలమని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌రెడ్డి, చైర్మన్ నర్సింహ్మారెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డోమెస్టిక్ సిలిండర్ల స్వాధీనం.. కేసు నమోదు

పోచారం: గృహావసరాలకు వాడుకోవాల్సిన గ్యాస్ సిలిండర్లను వ్యాపారం కోసం వాడుకుంటున్న వ్యక్తిపై పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కేసు నమోదు చేసి, సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడలోని ఓ టిఫిన్ సెంటర్‌లో ఇంటి అవసరాలకు వాడాల్సిన సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారన్న సమాచారంతో బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమంగా గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడు ఉపేందర్ (26)పై కేసు నమోదు చేసి, ఐదు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

(BY ORDER OF THE HON'BLE IV JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD)

IN THE COURT OF THE HON'BLE IV JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD

O.S NO. 3295 OF 2025

Between:

1. **Janampalli Ranthi Dev Rao,** S/o Late J. Kumudini Devi, Aged about 85 years, R/o. 7-1-22/11, Venkat Ram Bagh, Begumpet, Hyderabad, Telangana - 500016
2. **Janampalli Vikram Dev Rao,** S/o. Late J. Kumudini Devi, Aged about 83 years, R/o. 8-2-293/82, A-476, Road No. 22, Jubilee Hills, Shaikpet, Hyderabad, Telangana – 500033.
3. **P. Vijayalaxmi Reddy,** D/o. Late J. Kumudini Devi, Aged about 81 years, R/o. Plot No. 476, Road No. 22, Jubilee Hills, Shaikpet, Hyderabad, Telangana – 500033.
4. **N. Bharathi Devi,** D/o. Late J. Kumudini Devi, Aged about 79 years, R/o. 7-1-22/9 Opposite Lifestyle Begumpet, Hyderabad, Telangana - 500016 ... **Plaintiffs**

AND

1. **Greater Hyderabad Municipal Corporation,** Represented by its Commissioner, CC Complex, Tank Bund Road, Lower Tank Bund, Hyderabad - 500013
2. **Sub Registrar,** Sub Registrar Office, Balanagar Mandal, Plot No. 5, Balanagar, Medchal-Malkajgiri District.
3. **All Concerned** ... **Defendants**

NOTICE

To,
All Others Concerned

The General Public are hereby informed that Janampalli Ranthi Dev Rao, S/o. Late J. Kumudini Devi; Janampalli Vikram Dev Rao, S/o. Late J. Kumudini Devi; P. Vijayalaxmi Reddy, D/o. Late J. Kumudini Devi; N. Bharathi Devi, D/o. Late J. Kumudini Devi (hereinafter collectively referred to as Our Clients) have preferred a Suit vide O.S. No. 3295 of 2025 on the file of the Hon'ble IV Junior Civil Judge, City Civil Courts at Hyderabad seeking Declaration as legal heirs of Late J. Kumudini Devi

Any person's having any right/claim or interest in respect of being the legal heirs of the deceased Late J. Kumudini Devi are hereby called upon to appear before the Hon'ble IV Junior Civil Judge, City Civil Courts at Hyderabad **12.09.2025** either in person or through a Counsel. If you fail to appear before the Hon'ble Court, then the matter will be decided accordingly.

RUSHEEK REDDY K V, Advocate
3rd floor, JK Enclave, Rao and Raju Colony, Road No. 2, Banjara Hills, Hyderabad – 500 034. +91 98055 42236

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు



ఘట్‌కేసర్ అంబేద్కర్ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ అంబేద్కర్ చౌరస్తాలో, ఘనాపూర్, ఎదులాబాద్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్య, కాంగ్రెస్ బీబ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణముదిరాజ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మశ్చేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగరాజుముదిరాజ్, అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శశిధరన్, రమహన్, ఫరూక్, సంజీవరెడ్డి, ఖయూమ్, నరేశ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, గణేశ్‌యాదవ్, శంకర్ పాల్గొన్నారు.

మేడ్చల్ పట్టణంలో..

మేడ్చల్: పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధాన మంత్రి దివంగత రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమణారెడ్డి, దేవరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేకు రాజు తదితరులు పాల్గొన్నారు.

గౌడవెల్లి గ్రామంలో..

మేడ్చల్‌రూరల్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి గౌడవెల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమణారెడ్డి, నాయకులు వినోద్‌గౌడ్, మురళి,తదితరులు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



మేడ్చల్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



గౌడవెల్లి గ్రామంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు